సాక్షి
అనకాపల్లి
గురువారం, 28, మార్చి, 2024



సింహగిరికి యజ్ఞ శోభ

సింహగిరి నారసింహ మహాయజ్ఞం శోభను సంతరించుకుంది. యజ్ఞకాంతులతో దేదీప్యమానంగా మారింది. 8లో



396 నక్షత్ర తాబేళ్లు స్వాధీనం

అక్రమంగా తరలిస్తున్న తాబేళ్లను విశాఖ రైల్వేస్టేషన్‌లో డీఆర్‌ఐ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. 8లో

రంజాన్ వేళలు

అనకాపల్లి	ఇఫ్తార్ (గురు)	సహర్ (శుక్ర)
	6.13	4.41
నర్సీపట్నం	6.17	4.39

న్యూస్‌రీల్

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు

- ఎస్పీ కె.వి.మురళీ కృష్ణ



చందక రాధకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి: పోలీసుశాఖలో అంకిత భావంతో పనిచేస్తే తగిన గుర్తింపు లభిస్తుందని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అన్నారు. నక్కపల్లి పోలీసు స్టేషన్‌ల్లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతిచెందిన కానిస్టేబుల్ దుర్గాభవానీ కుటుంబానికి రూ.50వేల చెక్కును ఆయన బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానసిక ఒత్తిడికి గురికాకుండా సిబ్బంది విధులు నిర్వహించాలని తెలిపారు. మృతిచెందిన దుర్గా భవానీకి 9వ తరగతి చదువుతున్న నాగశాంతి, 6వ తరగతి చదువుతున్న హేమంత్ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారని చెప్పారు. పోలీసుశాఖ తరఫున ఆ కుటుంబానికి తగిన న్యాయం చేస్తామన్నారు. మృతిరాలి అమ్మమ్మ చందకరాధకు చెక్కు అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఏవో బి.శారద, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సతీష్, సిబ్బంది నిర్మలకుమారి, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన ఆర్టీసీ కండక్టర్

- టీడీపీ, జనసేన ఎన్నికల ప్రచారంలో ప్రసంగించిన ఉద్యోగి
- అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



టీడీపీ, జనసేన నాయకులతో కలిసి రాజకీయ ప్రచార సభలో ప్రసంగిస్తున్న కాశీపురం ఆర్టీసీ కండక్టర్ సూరెడ్డి ఈశ్వరరావు

దేవరాపల్లి: టీడీపీ, జనసేన ఎన్నికల ప్రచారంలో ఓ ఆర్టీసీ కండక్టర్ పాల్గొని ఎన్నికల కోడ్ ఉల్లంఘించాడు. మండలంలోని కాశీపురం గ్రామానికి చెందిన సూరెడ్డి ఈశ్వరరావు మద్దిలపాలెం ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. కాశీపురంలోని జనసేన మండల పార్టీ కార్యాలయంలో ఈ నెల 19న జరిగిన జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థితో కలిసి రాజకీయ ఎన్నికల ప్రచార సభలో పాల్గొని ప్రసంగించాడు. ప్రభుత్వ ఉద్యోగి అయినప్పటికీ ఎన్నికల నియమావళిని అతిక్రమించి రాజకీయ పార్టీ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న కండక్టర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కాశీపురం గ్రామస్తులు ఈ నెల 20న కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారికి, దేవరాపల్లి మండల సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ జి.లక్ష్మీనారాయణకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ విషయమై మాడుగుల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.వి.సత్యవాణి, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.లక్ష్మీనారాయణ వద్ద ప్రస్తావించగా ఫిర్యాదుపై విచారణ జరిపి సదరు ఆర్టీసీ రీజనల్ మేనేజర్, డిపో మేనేజర్‌కు తెలియజేశామని, ఆర్టీసీ అధికార్లు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు.

'అరణ్య' కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఈస్ట్‌కోస్ట్ జీఎం మనోజ్‌కుమార్ శర్మ

తాటిచెట్లపాలెం : విశాఖపట్నంలో వాల్తేర్ డివిజన్ నూతనంగా ఏర్పాటు చేసిన 'అరణ్య' ఔట్ డోర్ క్యాంపింగ్ కేంద్రాన్ని ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ కుమార్ శర్మ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వాల్తేర్ డివిజన్ బృందాన్ని ఆయన అభినందించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, అనురాగ్ మాంటిస్సోరి స్కూల్, వాకర్స్ కోసం ఈ కేంద్రం నిర్మించామని రైల్వే అధికారులు తెలిపారు. ఔట్ డోర్ యాక్టివిటీ కేంద్రం పిల్లల్లో ఆరోగ్యం మెరుగుదలకు, ఎదుగుదలకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఈకార్‌్వో భువనేశ్వర్ ప్రెసిడెంట్ దివ్య శర్మ, వాల్తేర్ డివిజన్ డివిజినల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్, ఈకార్‌్వో వాల్తేర్ ప్రెసిడెంట్ మంజుశ్రీ ప్రసాద్, ఏడీఆర్‌ఎంలు సుధీర్‌కుమార్ గుప్తా (ఇన్‌ఫ్రా), మనోజ్ కుమార్‌సాహు (ఆపరేషన్స్), ఈకార్‌్వో వైస్ ప్రెసిడెంట్లు కవితా గుప్తా, మధుస్మిత సాహు, ఈకార్‌్వో సభ్యులు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, సీనియర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్కసుతోనే ఫిర్యాదులు

- సీ-విజిల్‌కు అడ్డగోలుగా ఫిర్యాదులు చేస్తున్న టీడీపీ శ్రేణులు
- ప్రభుత్వ పథకాల శిలఫలకాలు, స్తంభాలకు కటౌట్లు, సర్వే రాళ్లపై యాప్‌లో నమోదు
- ప్రతి ఫిర్యాదును 100 నిమిషాల్లో పరిష్కరించాలన్న నిబంధన
- పరుగులు పెడుతున్న ఎన్నికల అధికారులు
- 126 ఫిర్యాదుల్లో 50కిపైగా ఈసీ పరిధిలోకి రానివే..
- నిజమైన ఉల్లంఘనలపైనే సీ విజిల్‌కు ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి



కమాండ్ కంట్రోల్ రూమ్

సాక్షి, అనకాపల్లి: ఎన్నికల నిబంధనలు, ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించేవారిపై రియల్ టైమ్‌లో ఫిర్యాదు చేసేందుకు ఎన్నికల సంఘం సీ-విజిల్ యాప్ తీసుకొచ్చింది. ఈ యాప్ సాయంతో పోలింగ్ స్టేషన్‌లో అనుమానాస్పద వ్యక్తులు, అవకతవకలకు సంబంధించి ఓటర్లు ఫిర్యాదు చేయవచ్చు. మద్యం, డబ్బు పంపిణీ, ఫేక్ న్యూస్, విద్వేషపూరిత ప్రసంగాలు, పరువు నష్టం, పోస్టర్లు, బ్యానర్లు, అనుమతి లేకుండా గిఫ్ట్ కూపన్ల పంపిణీ, అనుమతి లేకుండా వాహనాల ర్యాలీలు, నిషేధిత సమయాల్లో ప్రచారం, నిర్ణీత సమయానికి మించి స్పీకర్లను ఉపయోగించడం వంటి వాటిపై ఫిర్యాదులు చేయవచ్చు. ఇందులో ఫొటో, వీడియో, ఆడియో అప్‌లోడ్ చేసి, వెంటనే ఫిర్యాదు నమోదు చేసుకునే వెసులుబాటు ఉంది. ఇందులో ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో పరిష్కరించాల్సి ఉంది. ఫిర్యాదు వచ్చిందంటే ఎన్నికల సిబ్బంది కచ్చితంగా ఆ ప్రాంతానికి వెళ్లాల్సిందే. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తి చేయాలన్నదే ఎలక్షన్ కమిషన్ ప్రధాన ఉద్దేశం. కానీ టీడీపీ శ్రేణులు ఆ ఉద్దేశాన్ని దురుద్దేశపూర్వకంగా వినియోగిస్తున్నారు. అక్కసుతో అధికంగా ఫిర్యాదులు చేస్తున్నారు.

తప్పుడు ఫిర్యాదులతో ఇబ్బందులు

ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు కాకుండా ఇతర ఫిర్యాదులు, ఫేక్ ఫిర్యాదులు ఎక్కువగా ఉంటున్నాయి. తప్పుడు ఫిర్యాదులు చేయాలని కొందరు కంకణం కట్టుకున్నారు. లేనిపోని ఆరోపణలతో నిత్యం ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. దీంతో.. ఆ ప్రాంతాలకు వెళ్లి.. అక్కడ ఏమీ లేదని నిర్ధారించుకుని ఎన్నికల సిబ్బంది నివేదికలు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో నమోదైన వాటిలో వైఎస్సార్‌సీపీపై అక్కసుతో సరైన ఆధారాలు లేకుండా టీడీపీ చేసిన ఫిర్యాదులు చాలా ఉన్నాయి. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల కాకుండా వేరే ఫిర్యాదులు చేసి అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులతో ఆటలాడుకుంటున్నారు. సీ-విజిల్‌కు 126 వరకూ ఫిర్యాదులు రాగా.. ఇందులో 76 ఫిర్యాదుల్ని ఆయా ప్రాంతాలకు ఫ్లయింగ్ స్క్వాడ్స్, సర్వైలెన్స్ టీమ్స్, ఎంసీసీ బృందాలు వెళ్లి పరిష్కరించాయి. అయితే.. 50 ఫిర్యాదులు మాత్రం తప్పుడు ఫిర్యాదులుగా తేలాయి. ఇలాంటి ఫిర్యాదులతో ఎన్నికల సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు.

తప్పుడు ఫిర్యాదులు చేయవద్దు



ఫిర్యాదులపై ప్రతిరోజు సాయంత్రం ఐదు గంటలలోగా జిల్లా ఎన్నికల అధికారి రాష్ట్ర ఎన్నికల అధికారికి నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. ఫిర్యాదులన్నింటినీ కేంద్ర ఎన్నికల సంఘానికి పంపుతున్నాం. సీ-విజిల్, కంట్రోల్ రూమ్‌కి వచ్చే ప్రతి ఫిర్యాదుకీ క్షేత్రస్థాయిలో సిబ్బందితో పరిశీలించి, ఆధారాలతో నివేదిక తయారు చేస్తున్నాం. ఎన్నికల వ్యయంతో పాటు ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై నిఘా కోసం ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, వీడియో బృందాలు, మొబైల్ బృందాలను ఏర్పాటు చేశాం. ఎన్నికల ప్రవర్తన నియమావళిని అమలు చేసేందుకు 22 ఎంసీసీ బృందాలు, 24 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 12 వీఎస్‌టీ బృందాలు చొప్పున ఏర్పాటు చేశాం అయితే.. తప్పుడు ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి. దీనివల్ల మానవ వనరులతో పాటు ప్రజాధనం, సమయం వృథా అవుతోంది. దయచేసి ఎవరూ కూడా తప్పుడు ఫిర్యాదులు చేయవద్దు.

– రవి పట్టన్‌శెట్టి, జిల్లా ఎన్నికల అధికారి

పోస్టల్ బ్యాలెట్ వినియోగంలో మార్పులు

- వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దనే ఓటు వినియోగానికి అవకాశం



డీఆర్వో బి.దయానిధి

తుమ్మపాల: పోస్టల్ బ్యాలెట్ వినియోగంలో ఎన్నికల కమిషన్ మార్పులు చేసినట్టు జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి తెలిపారు. కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో వెలువడిన అభ్యంతరాలను పరిశీలనలోకి తీసుకుని ఈ మార్పులు చేసినట్టు చెప్పారు. పోస్టల్ బ్యాలెట్‌ను ఓటరు వెంట తీసుకువెళ్లకుండా వెంటనే వినియోగించే విధంగా ఎన్నికల కమిషన్ నిబంధనలను రూపొందించిందన్నారు. ఈ విషయాన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా ఓటర్లకు తెలియజేసి, అవగాహన కల్పించాలన్నారు. మునుపటిలా పోస్టు ద్వారా ఓటరుకు పంపించడం జరగదని చెప్పారు.

అనంతరం పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి కె.ఎస్. కుమార్ మాట్లాడుతూ వివిధ రకాల పోస్టల్, హోమ్ ఓటింగ్‌ల గూర్చి వివరించారు. సర్వీసు ఓటర్లు, ప్రత్యేక ఓటర్లు, ఎలక్షన్ విధుల్లో ఉన్న వారందరికీ పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్టు వివరించారు. 85 సంవత్సరాల వయసు పైబడినవారు, అనారోగ్యంతో ఉన్నవారు, 40 శాతం కన్నా ఎక్కువ అంగవైకల్యం కలిగిన వారి అభ్యర్థన మేరకు పోలింగ్ అధికారి వారి ఇంటి వద్దకు వెళ్లి ఓటు వేయించుకుంటారని చెప్పారు. అయితే ఒక సారి హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నట్టయితే ఆ విధానం ద్వారానే ఓటు హక్కు వినియోగించుకోవలసి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, కె.హరనాథబాబు, పి.నాగేశ్వరరావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ డి.రామ్మూర్తి, డీటీ రవికుమార్, ఎస్‌ఏ తులసీరామ్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

విశాఖ లీగల్: చిన్న చిన్న తగదాల కోసం కోర్టులు, పోలీస్ స్టేషన్లను ఆశ్రయించొద్దని జిల్లా న్యాయాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ అన్నారు. జిల్లా న్యాయాధికార సంస్థ, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ సహకారంతో జాతీయ మహిళ కమిషన్ (న్యూఢిల్లీ) సూచనల మేరకు మహిళలకు ప్రత్యేక న్యాయ విజ్ఞాన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శేషమ్మ మాట్లాడుతూ పురుషులకు 21 సంవత్సరాలు, మహిళలకు 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలని సూచించారు. పని ప్రదేశంలో వేధింపుల నివారణ, పోస్కో చట్టం, బాల్య వివాహాలు అరికట్టడం, మనోవర్తి చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి డాక్టర్ పి.ఉష, లైంగిక వేధింపుల ఫిర్యాదుల కమిటీ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ ఉష, వివిధ శాఖల అధికారులు బి.డి.జ్యోతిలత, ఎస్.సరజ, కె.శకుంతల, వీవీ కల్యాణి, జి.శరణ్య, తదితరులు పాల్గొన్నారు.



రికార్డ్ బ్రేక్!

- 2.9 మిలియన్లను అధిగమించిన ప్రయాణికులు
- విశాఖ ఎయిర్‌పోర్టు చరిత్రలో ఇదే అత్యధికం
- మూడు మిలియన్ల దిశగా అడుగులు

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రయాణికుల తాకిడిలో సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ ఎయిర్‌పోర్టు ఏర్పాటయ్యాక అత్యధిక మంది ప్రయాణికుల రాకపోకలను ఇప్పుడు నమోదు చేసింది. ఈ ఏడాది ఇప్పటివరకు 2.9 మిలియన్లు (29 లక్షల మంది) ప్రయాణికులు రాకపోకలతో ఈ రికార్డును సొంతం చేసుకుంది. ఇప్పటివరకు 2018లో 28.54 లక్షల మంది ప్రయాణించడమే అత్యధికం. కానీ ఇప్పుడు ఆ సంఖ్యను అధిగమించి 29 లక్షలకు చేరుకోవడం విశేషం! కోవిడ్-19 తర్వాత ఇతర ఎయిర్‌పోర్టుల మాదిరిగానే విశాఖ విమానాశ్రయానికి కూడా ప్రయాణికుల తాకిడి గణనీయంగా తగ్గింది. కోవిడ్ ప్రభావంతో 2020–21లో 11.14 లక్షల మంది మాత్రమే ఈ ఎయిర్‌పోర్టు ద్వారా ప్రయాణించారు. ఆ తర్వాత ఏడాది స్వల్పంగా పెరిగినా 16.31 లక్షలకు మించలేదు. అనంతరం ఏటికేడాది విమాన ప్రయాణికుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఇలా 2022–23లో 25 లక్షలకు, ఈ ఏడాది 29 లక్షలకు ఎగబాకింది. రానున్న ఏళ్లలో అది మూడు మిలియన్ల (30 లక్షల)కు చేరుకుంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ ఎయిర్‌పోర్టు సామర్థ్యాన్ని 3.6 మిలియన్లకు విస్తరించారు. అందుకనుగుణంగా ఎన్నో సదుపాయాలను కల్పించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన సౌకర్యాలను సమకూర్చారు. కొద్దిరోజుల క్రితమే ఎగ్జిక్యూటివ్ లాంజ్‌ను ప్రారంభించారు. చెక్ ఇన్ కౌంటర్లను 20–30కి పెంచారు. అరైవల్, డిపాచర్ టెర్మినల్ వద్ద మనీ ఎక్స్ఛేంజి కౌంటర్లు, తనిఖీల వేగవంతానికి ఇప్పుడున్న నాలుగు ఎక్స్‌రే స్కానింగ్ మిషన్లకు అదనంగా మరో రెండింటిని ఏర్పాటు చేశారు. డిజీయాత్ర యాప్‌ను కూడా అందుబాటులోకి తెస్తున్నారు. ఇన్‌లైన్ బ్యాగేజీ వ్యవస్థను రెండు నెలల్లో సిద్ధం చేస్తున్నామని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్.రాజారెడ్డి 'సాక్షి'కి చెప్పారు. విమానాశ్రయం ప్రయాణికుల రద్దీ 2.9 మిలియన్లను అధిగమించడం సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. మున్ముందు 3 లక్షల మిలియన్ల మైలురాయికి చేరుకుంటుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

పెరుగుతున్న విమాన సర్వీసులు..

మరోవైపు ఈ ఎయిర్‌పోర్టుకు విమాన సర్వీసులు కూడా పెరుగుతున్నాయి. ప్రస్తుతం సింగపూర్‌కు అంతర్జాతీయ విమాన సర్వీసు నడుస్తోంది. త్వరలో కౌలాలంపూర్, బ్యాంకాక్‌లకు కూడా కొత్త సర్వీసులు ప్రారంభం కానున్నాయి. ఇవికాకుండా హైదరాబాద్, ఢిల్లీలకు కూడా రెండు దేశీయ సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి.

పదేళ్లలో విమాన ప్రయాణికుల సంఖ్య

సంవత్సరం	ప్రయాణికులు
2014-15	10,97,566
2015-16	18,07,389
2016-17	23,59,234
2017-18	24,81,701
2018-19	28,54,118
2019-20	26,91,581
2020-21	11,14,704
2021-22	16,31,316
2022-23	25,00,789
2023-24	29,00,000

(మార్చి 27 వరకు)

భక్తి శ్రద్ధలతో సత్యసాయి ఆగమన దినోత్సవం



సమావేశంలో ప్రసంగిస్తున్న వక్తలు

యలమంచిలి రూరల్ : సత్యసాయిబాబా చూపిన మార్గం అందరికీ అనుసరణీయమని సత్యసాయి జాతీయ సేవా సమన్వయకర్త ఎస్.కోటేశ్వరరావు తెలిపారు. యలమంచిలి ప్రధాన రహదారి పక్కన ఓ ప్రైవేటు కల్యాణమండపంలో బుధవారం సత్యసాయిబాబా 60 ఏళ్ల ఆగమన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. 60 ఏళ్ల క్రితం భగవాన్ సత్యసాయిబాబా యలమంచిలి పట్టణానికి వచ్చారని, అప్పట్లో 50 వేల మంది భక్తులు హాజరయ్యారని చెప్పారు. సత్యసాయి సందేశాలు, బోధనలు ప్రస్తుత సమాజానికి ఎంతో అవసరమన్నారు. అనకాపల్లి, విశాఖపట్నం, పాడేరు ప్రాంతాలకు చెందిన పలువురు సంస్థాగత పదాధికారులు, రాష్ట్ర పదాధికారులు, అఖిల భారత పదాధికారులు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఉదయం నగర సంకీర్తన, నారాయణసేవ నిర్వహించారు. యలమంచిలి సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కోడూరు వెంకటేశ్వరరావు, ఆర్.లక్ష్మణరావు, సి.సురేంద్ర, కె.శ్యాంప్రసాద్, ప్రకాశరావు, వి.కృష్ణంరాజు, రాజారావు, గ్రంధి వెంకటస్వామి, పీల్లాన కామేశ్వరి, చైతన్య పాల్గొన్నారు.



'వాహన మిత్రో'త్సాహం!

- ఆటో, ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు ఏటా రూ.10 వేలు
- ఉమ్మడి విశాఖలో ఏడాదికి 36 వేల మందికి మేలు
- ఐదేళ్లలో రూ.179.21 కోట్లకు పైగా సాయం
- తమ కోసం ఆలోచించిన ఏకైక సీఎం జగనే అంటున్న డ్రైవర్లు



సాక్షి, విశాఖపట్నం/యలమంచిలి రూరల్/మాకవరపాలెం/తుమ్మపాల : ఆటోలు, ట్యాక్సీలు నడుపుకుంటూ స్వయం ఉపాధి పొందుతున్న వారి సంక్షేమానికి ప్రభుత్వం అమలుచేసిన వైఎస్సార్ వాహన మిత్ర పథకం ఎంతగానో ఉపయోగపడింది. ఇన్సూరెన్స్, రిపేర్లు, సర్వీసింగ్ వంటి ఖర్చుల నుంచి కాస్త ఉపశమనం ఇచ్చేలా ఏటా రూ.10 వేలు చొప్పున ఐదేళ్ల సాయం అందించింది. ఆటోలు, ట్యాక్సీలు, క్యాబ్ డ్రైవర్లు ఏ రోజుకారోజు వచ్చే ఆదాయంతో కుటుంబాలను పోషించుకుంటారు. వీరి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రం కావడంతో బీమా సొమ్ము చెల్లించలేక పోతున్నారు. తమ వాహనాలకు మరమ్మతులు చేయాలన్నా అప్పులు చేయాల్సి వస్తోంది. వాటిని తీర్చడానికి మరింత అప్పుల పాలవుతున్నారు. అరకొర రాబడితో జీవనం సాగించే వీరి కుటుంబాలకు చేయూత నివ్వాలని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపోశారు. ఏలూరులో పాదయాత్రలో ఉండగా 2018 మే 14న తాను అధికారంలోకి వచ్చాక ఆర్థిక సాయం అందిస్తానని ప్రకటించారు. ఆ ప్రకారమే అధికారంలోకి వచ్చాక 2019 అక్టోబర్ 14న వైఎస్సార్ వాహన మిత్ర పథకానికి ఏలూరులోనే శ్రీకారం చుట్టారు. ఈ పథకం కింద ఏటా ఆటో, ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు రూ.10 వేల చొప్పున ఇస్తున్నారు. ఈ సొమ్ముతో వారు వాహనాల ఫిట్‌నెస్, మరమ్మతులు, బీమా తదితర అవసరాలు తీర్చుకుంటారన్న సంకల్పంతో క్రమం తప్పకుండా చెల్లిస్తున్నారు. ఈ సొమ్మును వారి బ్యాంకు ఖాతాల్లోనే నేరుగా జమ చేస్తున్నారు. దీంతో గడచిన ఐదేళ్లుగా వీరు ఎంతో సంతోషంగా ఉన్నారు. గతంలో తమ కోసం ఇంతలా ఆలోచించిన ముఖ్యమంత్రులు లేరని ఈ వాహన మిత్ర లబ్ధిదారులు పేర్కొంటున్నారు. అందుకే తమకు ఆర్థికంగా దన్నుగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌కు ఎప్పుడూ రుణపడి ఉంటామని, అండగా నిలుస్తామని చెబుతున్నారు.

ఐదేళ్లలో ఎంత సాయమంటే..?

ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారు 36 వేల మందిని వాహనమిత్ర పథకం కింద ఆదుకున్నారు. వీరికి ఈ ఐదేళ్లలో రూ.179.21 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించారు. 2019 నుంచి 2022 వరకు ఉమ్మడి విశాఖ జిల్లాలో రూ.104.83 కోట్లు, మిగిలినది ఈ రెండేళ్లలోను చెల్లించారు. జిల్లాల పునర్విభజన జరిగాక విశాఖపట్నం జిల్లాలో రూ.41.84 కోట్లు, అనకాపల్లి జిల్లాలో రూ.25.84 కోట్లు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో రూ.6.70 కోట్లను వాహన మిత్ర పథకం కింద అందజేశారు.

బతుకు బండికి భరోసా ఇచ్చారు



నా పేరు కోడి నాగరాజు. మాది మాకవరపాలెం మండలం తూటిపాల. నేను 20 సంవత్సరాల నుంచి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాను. నాకు ముగ్గురు పిల్లలు. ఐదేళ్ల కిందటి వరకూ కుటుంబ పోషణ చాలా కష్టంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఆటో కార్మికులకు జగనన్న అండగా నిలిచారు. వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా వరుసగా ఐదు సంవత్సరాలు ఏడాదికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.50 వేలు నా ఖాతాలో జమ చేశారు. కరోనా కష్ట కాలంలో కూడా వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా రూ.10 వేల సాయం నా ఖాతాలో వేశారు. వాహనమిత్ర డబ్బుతో ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకుని ధైర్యంగా ఆటో తిప్పుతున్నాను. నా పెద్ద కుమార్తెకు విద్యా దీవెన పథకం కింద రూ.56,538, చిన్న కుమార్తెకు అమ్మ ఒడి రూ.45,000, నా కుమారుడికి వసతి దీవెనలో రూ.52,825 అందాయి. నా భార్యకు వైఎస్సార్ ఆసరాలో రూ.61,521, సున్నా వడ్డీ రూ. 2,666 వచ్చాయి. కోవిడ్ సాయంగా రూ.10 వేలు అందించారు. ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న మాకు ఈ ప్రభుత్వం ఒక అండగా నిలిచింది.

అప్పుల బాధ తప్పింది



నా పేరు బొండా బాలు, మాది అనకాపల్లి మండలం రేబాక. నేను 2014 ఏడాదిలో సొంతంగా ఆటో కొనుక్కున్నాను. ఆటో నడపడం వల్ల ప్రతి రోజు డీజిల్ ఖర్చు పోను రూ.300 వరకు మిగిలేవి. వాటితో ఇంటిల్లిపాది జీవనం సాగించేవారిమి. ఆటోకు ప్రతి ఏటా ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ తప్పనిసరిగా చేసుకోవలసి వచ్చేది. ఇందుకోసం వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి అప్పుతీసుకుని చెల్లించేవాడిని. ఆటో సర్వీస్‌తో వచ్చిన డబ్బు వడ్డీలకే సరిపోయేది.

దీంతో కుటుంబ పోషణకు ఇబ్బంది పడేవాడిని. జగనన్న ప్రభుత్వం వచ్చాక వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా ప్రతి ఏటా రూ.10 వేలు ఖాతాలో జమ చేస్తున్నారు. ఈ సొమ్ముతో ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లు తీసుకుంటున్నాను. ఆ తరువాత ఎటువంటి అప్పులు తీసుకోలేదు. ఆటో సర్వీసుతో వచ్చిన సొమ్ముతో చాలా సంతోషంగా జీవిస్తున్నాను.

జగనన్న అండగా నిలిచారు



నా పేరు వియ్యపు రామారావు, మాది రాంబిల్లి మండలం హరిపురం. నేను 20 సంవత్సరాల నుంచి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాను. పాదయాత్రలో ఇచ్చిన మాట నిలబెట్టుకుని ఆటో కార్మికులకు జగనన్న అండగా నిలిచారు. వరుసగా ఐదు సంవత్సరాలుగా ఏడాదికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.50 వేలు నా ఖాతాలో జమ చేశారు. కరోనా కష్ట కాలంలో కూడా వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా రూ.10 వేల సాయం నా ఖాతాలో వేశారు. నా కుటుంబానికి ఆసరా అయింది. నాకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. అమ్మ ఒడి పథకం ద్వారా ఏడాదికి రూ.15 వేల ఆర్థిక సాయం అందుతోంది. నా తండ్రికి వృద్ధాప్య పింఛను నెల నెలా ఇంటికే తెచ్చిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మూడేళ్లు పింఛను కోసం తెలుగుదేశం పార్టీ నాయకుల చుట్టూ తిరిగాం. జగనన్న ప్రభుత్వం వచ్చాక ఎవరి చుట్టూ తిరగకుండా ఎవరికీ రూపాయి లంచం ఇవ్వకుండా నేరుగా లబ్ధి చేకూరింది. రైతు భరోసా పెట్టుబడి సాయం కూడా అందింది. వాహనమిత్ర డబ్బుతో ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకుని ధైర్యంగా ఆటో తిప్పుతున్నా. గత టీడీపీ ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంత ఆటోలను విశాఖ సిటీ పరిధిలోకి అనుమతించేవారు కాదు. ఒకవేళ వెళితే కేసులు పెట్టి, భారీ జరిమానాలు విధించేవారు. ఇపుడు ఆ కష్టాలేవీ లేవు. ఇంతకన్నా ఏం కావాలి. మాలాంటి వారి కోసం ఆలోచన చేస్తున్న సీఎం జగనన్నకు పేదలందరూ అండగా ఉంటారు.

క్లుప్తంగా

హైకోర్టు జడ్జి విశాఖ రాక రేపు

మహారాణిపేట(విశాఖ): రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ వి.శ్రీనివాస్ ఈనెల 29న విశాఖ వస్తున్నారు. విజయవాడ నుంచి వందే భారత్ రైలులో మధ్యాహ్నం 1.50 గంటలకు విశాఖ చేరుకుంటారు. మధ్యాహ్నం 3.30 గంటలకు సింహాచలం వెళ్లి శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకుంటారు. రాత్రికి గరీబ్‌రథ్ రైలులో తిరిగి విజయవాడ వెళ్తారు.

గంజాయి స్వాధీనం



గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు

దేవీపట్నం: మండలంలోని పోతవరం నుంచి దండంగి వెళ్లే మార్గంలో బుధవారం వాహన తనిఖీల్లో 500 గ్రాముల గంజాయి పట్టుకున్నట్లు ఎస్సై నాగార్జున తెలిపారు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన రాజేష్ కుమార్ సింగ్‌ను పట్టుకుని, ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించామన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి



రైతులకు టార్పాలిన్, అల్లం విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏఎస్పీ ప్రతాప్ శివకిశోర్

చింతపల్లి రూరల్: గిరిజన రైతులు సాగులో మెలకువలు నేర్చుకుని అధిక దిగుబడులు సాధించాలని చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివకిశోర్ అన్నారు. స్థానిక పరిశోధన స్థానంలో బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు ఆర్గానిక్ సేంద్రియ విధానంలో సాగు చేయాలన్నారు. సాగులు, సిగినపల్లి, మాడేం గ్రామాలకు సంబంధించిన 10 మంది రైతులకు టార్పాలిన్లు 12 మందికి 200 కేజీల అల్లం విత్తనాలు, మామిడి పూత సంరక్షణకు ఐదు వేల కవర్లను పంపిణీ చేశారు.

బూడి, అనురాధకు శుభాకాంక్షల వెల్లువ



అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, మాడుగుల అసెంబ్లీ అభ్యర్థి ఈర్లె అనురాధను సత్కరిస్తున్న చీడికాడ వైఎస్సార్‌సీపీ నాయకులు



అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడును సత్కరిస్తున్న ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ తదితరులు

దేవరాపల్లి : వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును అధిష్టానం ప్రకటించడం పట్ల జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు హర్షాతిరేకం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి తారువలో బూడి ముత్యాలనాయుడుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

మాడుగుల నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి ఎంపీ అభ్యర్థి ముత్యాలనాయుడుతోపాటు మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి ఈర్లె అనురాధను శాలువాలతో ఘనంగా సత్కరించి, మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు. ఏపీ ఇన్‌లాండ్స్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, గోవాడ సుగర్స్ సీడీసీ చైర్మన్ సుంకరి శ్రీనివాసరావు, చీడికాడ, కె.కోటపాడు ఎంపీపీలు కురచా జయమ్మ, రెడ్డి జగన్‌మోహన్, మాడుగుల జెడ్పీటీసీ కిముడి రమణమ్మ, నాయకులు కురచా నారాయణమూర్తి, లాలం జానకీరామ్, మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సూలం రమేష్, అనకాపల్లి మండలం తుంపాల సర్పంచ్ తట్టా అప్పారావు, వైస్ ఎంపీపీ భర్త విల్లూరి చంద్రశేఖర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎప్పటికీ వైఎస్సార్‌సీపీలోనే ఉంటాం



తిరిగి సొంతగూటికి వచ్చిన చోడవరానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువ కార్యకర్తలకు పార్టీ కండువావేసి స్వాగతించిన ఎమ్మెల్యే ధర్మశ్రీ



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

- తిరిగి సొంతగూటికి వచ్చిన వైఎస్సార్‌సీపీ యువ కార్యకర్తలు
- పార్టీ కండువావేసి స్వాగతించిన ఎమ్మెల్యే ధర్మశ్రీ

చోడవరం : తమను టీడీపీ నాయకులు బలవంతంగా పార్టీలో చేరినట్టు ప్రచారం చేయించారని, తాము ఎప్పటికీ వైఎస్సార్‌సీపీలోనే ఉంటామని చోడవరం పట్టణానికి చెందిన యువ నాయకులు జలగడుగుల ప్రణీతి, వర్రి నందకిషోర్, కిరణ్ తోపాటు పలువురు యువకులు చెప్పారు. చోడవరం వైస్సార్‌సీపీ కార్యాలయానికి వచ్చి ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ సమక్షంలో వైస్సార్‌సీపీ కండువాలు వేసుకొని తాము ఎప్పటికీ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలమేనని ఉద్ఘాటించారు. స్నేహపూర్వకంగా తమతూ ఉంటూ టీడీపీ నాయకులు తమను వారి పార్టీలో చేర్చుకున్నట్టు ప్రచారం చేశారే తప్పా తాము మనస్ఫూర్తిగా పార్టీ మారలేదని, తామంతా వైఎస్సార్‌సీపీలోనే ఉంటామని వారు అన్నారు. ఎమ్మెల్యే ధర్మశ్రీని గెలిపించడంతోపాటు ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి గెలిపించుకోవడానికి తామంతా కలిసి కృషి చేస్తామని అన్నారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల రమేష్, మండల యూత్ అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, వార్డు మెంబరు పసుమర్తి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నాతవరం మండలంలో టీడీపీకి షాక్

నర్సీపట్నం : నాతవరం మండలం, డి.ఎర్రవరం టీడీపీ నుంచి పలువురు వైఎస్సార్‌సీపీలో బుధవారం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సమక్షంలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ నాయకుల తీరు నచ్చకపోవడం వల్ల వైఎస్సార్‌సీపీలో చేరామని పార్టీలో చేరిన వారు తెలిపారు. పార్టీ విజయానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పైల సునీల్ పాల్గొన్నారు.

హోరెత్తిన వైఎస్సార్‌సీపీ ప్రచారం



'కూల్'గా ప్రచారం : చోడవరం తామర చెరువు వద్ద ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు ఇచ్చి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ



ఓటర్లకు వందనం : అమలాపురంలో ప్రజలకు అభివాదం చేస్తున్న నర్సీపట్నం ఎమ్మెల్యే గణేష్



అనకాపల్లిలో టిఫిన్ విక్రయిస్తున్న మహిళను ఓటు అభ్యర్థిస్తున్న మలసాల భరత్‌కుమార్

చోడవరం : వైఎస్సార్‌సీపీ చోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, విప్ కరణం ధర్మశ్రీ ఎన్నికల ప్రచారం బుధవారం చోడవరం పట్టణంలో నిర్వహించారు. వెలమవీధిలో ఓ కాకా హోటల్‌లో దోసెలు వేసి ఆకట్టుకున్నారు. అనంతరం తామర చెరువు వద్ద మండుటెండలో పని చేస్తున్న వేతనదారులకు మజ్జిగ ప్యాకెట్లు పంచిపెట్టి వారి దాహం తీర్చారు. మండువేసవిలో కూల్‌కూల్‌గా ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి తనను గెలిపించాలని కోరారు.

నర్సీపట్నం: గడపగడపకు కార్యక్రమంలో భాగంగా మండలంలో అమలాపురంలో నర్సీపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ పర్యటించారు. గ్రామస్తులు ఆయనకు పూల వర్షం కురిపించి, హారతులు పట్టి ఘనస్వాగతం పలికారు. టీడీపీ మోసాలపై వివరించారు. టీడీపీ నుంచి పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు.

అనకాపల్లి : ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ అనకాపల్లిలోని 83వ వార్డు మిరియాల కాలనీలో గడప గడపకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో, పార్టీ స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి, తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా ప్రజలను అభ్యర్థించారు.

396 నక్షత్ర తాబేళ్లు స్వాధీనం

తాటిచెట్లపాలెం: అక్రమంగా తరలిస్తున్న తాబేళ్లను విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. వాటిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. షాలిమార్ ఎక్స్‌ప్రెస్‌లో నక్షత్ర తాబేళ్లు అక్రమంగా తరలిస్తున్నట్లు ముందుగా అందిన సమాచారంతో డీఆర్ఐ అధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. 396 నక్షత్ర తాబేళ్లు స్వాధీనం చేసుకున్నారు. వీటిని పశ్చిమ బెంగాల్ నుంచి తమిళనాడుకు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. నిందితులను అరెస్ట్ చేసి, తాబేళ్లను ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ అధికారులకు అప్పగించారు.



డీఆర్ఐ స్వాధీనం చేసుకున్న తాబేళ్లు

పాలిసెట్ ఉచిత కోచింగ్‌కు ఏర్పాట్లు

ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో 28 నుంచి దరఖాస్తుల స్వీకరణ

మురళీనగర్: పదో తరగతి అనంతరం పాలిటెక్నిక్ కాలేజీల్లో చేరి సాంకేతిక విద్య అభ్యసించాలనుకునే విద్యార్థులకు ఏప్రిల్ 27న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్, పాలిసెట్ జిల్లా కన్వీనర్ డాక్టర్ కె.నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్టేట్ డైరెక్టర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సి.నాగరాణి ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలల్లో ఉచిత కోచింగ్ అందిస్తామని తెలిపారు. పదో తరగతి పాసైన వారితోపాటు పదో తరగతి పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీకి వెళ్లి ఈ నెల 28 నుంచి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 1 నుంచి అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీకి సంబంధించి నేరుగా కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ముందుగా దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే కోచింగ్‌కు అవకాశమిస్తామని తెలిపారు. పెందుర్తి, భీమిలి ప్రభుత్వ పాలిటెక్నికల్ కాలేజీలతోపాటు కంచరపాలెం కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ (గైస్)లో కూడా శిక్షణ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.

20 లీటర్ల సారాతో ఒకరి అరెస్టు



పట్టుబడ్డ సారాతో నిందితుడు, రావికమతం ఎస్ఐ ధనంజయ్

రావికమతం : గదబపాలెం గ్రామంలో పెద్ద ఎత్తున సారా తయారు చేస్తున్నట్టు అందిన సమాచారంతో సిబ్బందితో దాడి జరిపి ఒకరిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ ధనంజయ్ బుధవారం తెలిపారు. గ్రామం శివారున పొలాల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల పులుపును, తయారీ పరికరాలను గుర్తించి ధ్వంసం చేశామన్నారు. ఆ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి 20 లీటర్ల సారాతో పారిపోతుండగా పట్టుకుని అరెస్ట్ చేశామని ఎస్ఐ తెలిపారు.

టిఫిన్ షాపులో అక్రమంగా మద్యం నిల్వ

- ఒకరి అరెస్టు



పట్టుబడిన అక్రమ మద్యం సీసాలు

చోడవరం రూరల్ : అక్రమంగా మద్యం నిల్వ చేసిన టిఫిన్ షాపు యజమాని నుంచి చోడవరం పోలీసులు 30 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అతడిని అరెస్టు చేశారు. చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు అందించిన వివరాలివి. చోడవరం పట్టణ శివారు బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన బొంతు శ్రీను (46) తన టిఫిన్ షాపులో అక్రమంగా మద్యం నిల్వ చేసినట్టు సమాచారం అందడంతో ఎస్ఐ ఎ.సూర్యనారాయణ సిబ్బందితో కలసి బుధవారం ఉదయం దాడి చేయగా టిఫిన్ షాపులో దాచిన 30 మద్యం సీసాలు పట్టుబడ్డాయని, దీంతో అతడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని సీఐ తెలిపారు.

1300 లీటర్ల సారా పులుపు ధ్వంసం



సారాబట్టీ వద్ద పట్టుబడిన సామగ్రితో పోలీసులు



గంటికొర్లాం కొండల వద్ద పులుపు ధ్వంసం చేస్తున్న పోలీసులు

గొలుగొండ: కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మారుమూల ప్రాంతాల్లో నాటుసారా తయారికి ఉపయోగించే సారా పులుపును ఎస్ఐ ఉపేంద్ర ఆధ్వర్యంలో బుధవారం ధ్వంసం చేశారు. కొంకసింగి, నాగాపురం, అల్లూరి జిల్లా సరిహద్దులో సారా తయారీకి ఉపయోగపడే 1300 లీటర్ల సారా పులుపును ధ్వంసం చేశామని ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు. సారా తయారి, అమ్మకాలు, బెల్టు షాపుల్లో మద్యం అమ్మకాలు చేయరాదని హెచ్చరించారు.

బుచ్చెయ్యపేట : మండలంలో గల శివారు పంచాయతీ గంటికొర్లాం కొండలవద్ద గుట్టుగా సారా తయారీ చేస్తున్న సారా బట్టీలపై బుచ్చెయ్యపేట పోలీసులు దాడులు చేశారు. స్థానికుల సమాచారం మేరకు బుధవారం ఎస్ఐ డి.ఈశ్వరరావు తమ సిబ్బందితో గంటికొర్లాం కుప్పకొండ ప్రాంతాల్లో నాలుగు కిలోమీటర్ల పైన కాలినడకన వెళ్లి సారా బట్టీల కోసం గాలింపు చేపట్టారు. కొండ వద్ద సారా తయారీకి సిద్ధం చేసిన 1,500 లీటర్ల బెల్లం పులుపును, సారా తయారీకి ఉపయోగించే పరికరాలను గుర్తించి వాటిని అక్కడే దహనం చేశారు. నిర్వాహకుడి గురించి ఆరా తీశారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సింహగిరికి యజ్ఞ శోభ



శారదా పీఠాధిపతులను సత్కరిస్తున్న దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి



అగ్నిని(అగ్నిమథనం) సృష్టిస్తున్న అర్చకులు



యజ్ఞంలో పాల్గొన్న ఉభయదాతలు

- వైభవంగా సుదర్శన నారసింహ మహాయజ్ఞం ప్రారంభం
- పూర్ణాహుతిలో పాల్గొన్న శారదాపీఠాధిపతులు
- తొలిరోజు పాల్గొన్న వంద మంది ఉభయదాతలు

సింహాచలం: సింహగిరి బుధవారం సుదర్శన నారసింహ మహాయజ్ఞం శోభను సంతరించుకుంది. ఎటు చూసినా యజ్ఞకాంతులతో ప్రజ్వరిల్లింది. లోకకల్యాణార్థం ఏప్రిల్ 1వ తేదీ వరకు జరగనున్న సుదర్శన నారసింహ మహాయజ్ఞంను పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి దేవస్థానం అర్చకులు శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఉదయం 6 గంటల నుంచి యజ్ఞఘట్టాలను నిర్వహించారు. స్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఓ పల్లకీలో, చక్రపెరుమాళ్‌ను ఓ పల్లకీలో అధిష్ఠింపజేసి ఆలయ ఉత్తర రాజగోపురం ఎదురుగా ఏర్పాటు చేసిన యాగశాలలోకి తిరువీధిగా తీసుకొచ్చారు. యజ్ఞశాలలో చక్రపెరుమాళ్‌ను, మరొక వేదికపై స్వామి ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేశారు. యాగశాల మూర్తి ఆరాధన, శాంతిపాఠం, గోపూజ నిర్వహించారు. ప్రకృతి సిద్ధంగా అగ్ని మథనం చేశారు. అనంతరం అగ్నిప్రతిష్ఠాపనం, కుంభావాహనం, మండలావాహనం, ధ్వజావరోహణం చేపట్టారు. తదుపరి యజ్ఞశాలలో ఏర్పాటు చేసిన ఐదు హోమ గుండాల వద్ద రుత్వికులు యజ్ఞాన్ని ప్రారంభించారు. మధ్యాహ్నం 12గంటల సమయంలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పూర్ణాహుతి ప్రసాదాన్ని యజ్ఞంలో పాల్గొన్న ఉభయదాతలు, భక్తులకు అందజేశారు. అనంతరం ఉత్సవమూర్తుల చెంతన రామాయణం, భాగవతం, విష్ణుపురాణం, నృసింహ సహస్రనామం, దివ్యప్రబంధ పారాయణం, క్షేత్ర మహత్యం, సుదర్శన శతకం పారాయణాలను వైదికులు పఠించారు. విశేషంగా హారతులు అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా, తమిళనాడు నుంచి వచ్చిన సుమారు 60 మంది రుత్వికులు యజ్ఞం నిర్వహించారు. విశాఖ శ్రీ శారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. యజ్ఞంలో పాల్గొన్న ఉభయదాతలకు దేవస్థానం తరఫున శాలువ, రవిక, కల్యాణం లడ్డూ, అర కిలో పులిహోర ప్రసాదం, అప్పన్న స్వామి రాగి ప్రతిమ అందజేశారు. పిలిగ్రిమ్స్ సెంటర్‌లో ప్రత్యేకంగా భోజన సదుపాయం అందజేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. దేవస్థానం వంశపార ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతి రాజు, ట్రస్ట్ బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

అప్పన్నకు శారదాపీఠాధిపతులు పూజలు

సుదర్శన నారసింహ మహా యజ్ఞంలో పాల్గొనేందుకు వచ్చిన శారదాపీఠాధితులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి మూలవిరాట్‌ను దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద వారికి దేవస్థానం అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామీజీల పేరిట అంతరాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో కుంకుమార్చన చేసి, వేద ఆశీర్వచనం అందజేశారు. దేవస్థానం తరఫున ఈవో శ్రీనివాసమూర్తి స్వామీజీలకు శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందించారు.

డీజిల్ స్మగ్లింగ్ ముఠా అరెస్ట్

దాబాగార్డెన్స్: సముద్రంలో ఉన్న నౌకల నుంచి డీజిల్ స్మగ్లింగ్ చేసే ముఠా గుట్టు రట్టయ్యింది. నిందితులు వీర్రాజు, బడే రాజు, సూరాడ రామును పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు డీసీపీ – 2 ఎం.సత్తిబాబు బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... సముద్రంలో ఉన్న నౌకల నుంచి డీజిల్ తస్కరించి బోట్ల ద్వారా తీరానికి తీసుకొచ్చి లీటర్ డీజిల్ రూ.60, రూ.70కి విక్రయిస్తున్నట్టు గుర్తించామన్నారు. సుమారు 13 మంది నౌకల నుంచి డీజిల్ స్మగ్లింగ్ చేస్తున్నట్టు గుర్తించామని, వీరిలో ముగ్గురు పట్టుబడగా, మిగిలిన వారి కోసం గాలిస్తున్నట్టు తెలి పారు. వీరంతా కాకినాడ, మచిలీపట్నం నుంచి పెద్ద ఎత్తున స్మగ్లింగ్ చేసి విశాఖ తీరానికి తరలిస్తున్నారని, 12 కేసేల్లో 500 లీటర్ల డీజిల్ స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

దోమల నివారణకు పూర్తి స్థాయిలో స్ప్రేయింగ్

రంపచోడవరం: మలేరియా పూర్తిస్థాయిలో నిర్మూలనకు గ్రామాల్లో ప్రతీ ఇంటికి నివారణ మందు పిచికారీ చేయిస్తామని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆయన ఏడీఎంహెచ్‌వో, మలేరియా అధికారులతో నిరర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15 నుంచి పిచికారీ ప్రారంభమైందన్నారు. మలేరియా లక్షణాలు ఉంటే వారికి రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్యం అందించాలని సూచించారు. మలేరియాకు సంబంధించిన మందులు, ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జనవరి నుంచి ఇప్పటివరకు నమోదైన కేసుల వివరాలను వైద్యాధికారులు, సబ్ యూనిట్ అధికారుల నుంచి ఆయన తెలుసుకున్నారు. మలేరియా నిర్మూలనకు అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దోమల నివారణ మందు పిచికారీపై ఎప్పటికప్పుడు నివేదిక అందజేయాలని ఆయన కోరారు.

నీటి సంపులో పడి సెక్యూరిటీ గార్డు మృతి



గణేష్ మృతదేహం వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కూర్మన్నపాలెం: డ్యూటీలో ఉంటూ నీటి సంపులో పడి ఓ సెక్యూరిటీ గార్డు మృతి చెందిన ఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అనకాపల్లి జిల్లా కశింకోట గ్రామానికి చెందిన అల్లవరపు గణేష్ (32) అటోనగర్‌లోని ఎస్ బ్లాక్ వద్ద ఉన్న టీపీఎల్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. అతని భార్య దేవి కూడా ఆటోనగర్‌లో పనిచేస్తున్నారు. వీరు దువ్వాడ సెక్టార్ – 1 మంగళపాలెం శ్రీసాయి నగర్‌లో అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి నైట్ డ్యూటీకి వెళ్లిన గణేష్ బుధవారం ఉదయం టీపీఎల్ కంపెనీలో ఉన్న నీటి సంపులో విగతజీవిగా పడి ఉన్నాడు. నీటి సంపుపై రక్షణగా జాలీ లేదు. దీంతో టీపీఎల్ కంపెనీ యాజమాన్యం దువ్వాడ పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. గణేష్ భార్య దేవికి అక్కడే పని చేస్తున్న కంఠపురెడ్డి శ్రీను విషయం తెలియపరిచాడు. వెంటనే అక్కడికి చేరుకున్న భార్య దేవి దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూకాలమ్మ ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు



నూకాలమ్మ అమ్మవారు

రాజవొమ్మంగి: స్థానిక గ్రామదేవత శ్రీనూకాలమ్మ అమ్మవారి గుడి తలుపులు తెరచుకొన్నాయి. కొత్త అమావాస్యకు జరిగే తిరునాళ్లకు ఏర్పాట్లు మొదలయ్యాయి. వంశపారంపర్యంగా వస్తున్న గుడి ఆసాదులు అమ్మవారి తలుపులు తీసి గరగలను బయటకు తీయడంతో ఉత్సవాలు మొదలైనట్టు స్థానికులు భావిస్తారు. ప్రతి రోజు రాత్రిళ్ల జరిగే గరగ నృత్యాలను భక్తులు ఆసక్తిగా తిలకిస్తారు. డప్పు వాయిద్యాలు, బాణాసంచా వెలుగుల్లో తమ ఇళ్లకు వచ్చే గరగలను సాక్షాత్తు అమ్మవారిగా భావించి పసుపు కుంకుమ, నూతన వస్త్రాలు, రకరకాల పిండివంటలు, పండ్లు పూలు సమర్పించి మొక్కులు తీర్చుకోవడం గ్రామస్తుల ఆచారం. ఏప్రిల్ 6. 7. 8 తేదీల్లో అమ్మవారి ఉత్సవాలు జరగనున్నాయి. వేలాదిగా భక్తులు హాజరవుతారు. 9వ తేదీ తెల్లవారుజాముతో ఉత్సవాలు ముగించడంతో తిరిగి గుడి తలుపులు మూసివేస్తారు. కొత్త అమావాస్య పండుగ ముగియగానే వచ్చే నూతన సంవత్సరం రోజున రైతులు ఏరువాక సాగి పొలం పనులకు శ్రీకారం ఆనవాయితీ. నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు వైభవంగా జరిపేందుకు ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది.

క్లుప్తంగా

వైభవంగా మరిడిమాంబ విగ్రహ ప్రతిష్ట



మరిడిమాంబను దర్శించుకుంటున్న సర్పంచ్ పీలా ఉషా అప్పారావు దంపతులు

అనకాపల్లి: మండలంలోని దిబ్బపాలెం గ్రామంలో బుధవారం మరిడిమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరిగింది. మరిడిమాంబ దివ్యయంత్ర, శిఖర ప్రతిష్ట, అమ్మవారి విగ్రహ ఆవిష్కరణ మహోత్సవాన్ని ప్రముఖ వేదపండితులు బంకుపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారి ఆలయం వద్ద కళాహవనములు గర్త, రత్న, బీజన్యాసములు, శిఖర, యంత్ర ప్రతిష్ట, నేత్రోత్సవం, కూష్మాండబలి, ధేను, దర్పణ దర్శనం వంటి కార్యక్రమాలను వేదపండితులు చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది. అమ్మవారి విగ్రహదాతలు పీలా సూరిఅప్పారావు లక్ష్మి, కనకదుర్గారావు లక్ష్మీదేవి దంపతులు పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పీలా ఉషా అప్పారావు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కార్పెంటర్స్ సమస్యల పరిష్కారానికి కృషి



కార్పెంటర్స్ డే సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న కార్పెంటర్స్ సంఘాల సభ్యులు

అనకాపల్లి: పట్టణ పరిధిలో కార్పెంటర్స్ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి, వాటి పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషిచేయనున్నట్లు కార్పెంటర్స్(వడ్రంగి) సంఘం పట్టణ అధ్యక్షుడు వానపల్లి కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక గవరపాలెం కామాక్షి అమ్మవారి ఆలయం వద్ద నుంచి కార్పెంటర్స్ డే పురస్కరించుకుని ఎన్టీఆర్ వైద్యాలయంలో రోగులకు రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు కోసూరి మన్మధరావు, ప్రధాన కార్యదర్శి సింహాద్రి కోటేశ్వరరావు, కోశాధికారి మునాసన రామకృష్ణ, పట్టణ కామాక్షి కార్పెంటర్స్ సంఘం సభ్యులు, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 4,336 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,700	4,480
మొదటి రకం	3,500	4,050
రెండో రకం	3,440	3,790
మూడోరకం	3,310	3,530

అనకాపల్లి సినిమాలు

ఈగల్	రాజా
గామి	సత్యనారాయణస్క్రీన్-1
ప్రేమలు	సత్యనారాయణస్క్రీన్-2
అనన్య	షిర్డిసాయి
ఓం భీం బుష్	పర్తిసాయి
ది గోట్ లైఫ్	వెంకటేశ్వర
రికార్డ్ బ్రేక్	శ్రీసత్య
భీమా	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 39 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, బీ పాజిటివ్-19 యూనిట్లు, ఓ పాజిటివ్-10 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 336 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 242 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

ఊరు మారింది

గొబ్బూరు..

పరిధి చిన్న.. అభివృద్ధి మిన్న

గొబ్బూరు గ్రామ పంచాయతీ పరిధి చాలా తక్కువ. అయినా గత ఐదేళ్లలో ఎన్నడూ లేనంత అభివృద్ధికి నోచుకుంది. ప్రధాన వీధులతోపాటు, ఇరుకు సందుల్ని కూడా సిమెంట్ రోడ్లుగా మార్చారు. గ్రామం అంతా పక్కా రోడ్లు, సీసీ కాలువలు నిర్మించారు. వెయ్యి జనాభా ఉన్న ఈ గ్రామంలో కేవలం రోడ్లు, కాలువల నిర్మాణానికే ఈ ప్రభుత్వం సుమారు రూ.కోటి వెచ్చించడం గమనార్హం.

- గ్రామంలో అన్ని రోడ్లూ సీసీ రోడ్లే
- 84 మందికి జగనన్న లే అవుట్‌లో ఇళ్లు



గొబ్బూరు గ్రామంలోని చంద్రబాబు కాలనీలో నిర్మించిన సిమెంట్ రోడ్డు



జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం



దాత విరాళంతో మామిడివాక గెడ్డకు సీసీ కాలువ నిర్మాణం

కశింకోట: మండలంలోని గొబ్బూరు గ్రామ పంచాయతీ మారుమూలన ఉంది. సుమారు వెయ్యి మంది జనాభా కలిగి ఉన్న ఈ పంచాయితీ మండలంలోని అతి చిన్న పంచాయతీల్లో ఒకటి. ఇలాంటి గ్రామం కూడా పెద్ద పంచాయతీల స్థాయిలోనే అభివృద్ధికి నోచుకుంది. గత ప్రభుత్వంలో మౌలిక వసతుల్లేకుండా లబ్ధిదారులకు అప్పగించిన చంద్రబాబుకాలనీలో సైతం ఈ ప్రభుత్వం నిధులు వెచ్చించి, రోడ్లను నిర్మించింది.

రోడ్లు, డ్రైనేజీలకు ప్రాధాన్యం

గత ప్రభుత్వంలో ఈ గ్రామంలో రోడ్లు, డ్రైనేజీలు అధ్వానంగా ఉండేవి. దీంతో ప్రస్తుత ప్రభుత్వంలో వాటిపైనే ఎక్కువ దృష్టిపెట్టారు. అవసరమైన ప్రతి చోటా సీసీ రోడ్లు నిర్మించారు. ఇందుకు ప్రభుత్వ నిధులు రూ.40 లక్షలు వెచ్చించారు.

- చంద్రబాబు కాలనీలో రూ.12 లక్షలతో సీసీ రోడ్లు వేశారు. ఇందులో సగం నిధులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నేరుగా చెల్లించగా, మిగిలిన మొత్తం పంచాయతీ నిధుల నుంచి కేటాయింపులు చేశారు.



సందులో నిర్మించిన సిమెంట్ రోడ్డు

- గ్రామంలో పలు చోట్ల అంతర్గత రోడ్లను సీసీ రోడ్లుగా మార్చేందుకు ఉపాధి పథకం నిధులు రూ.10 లక్షలు, పంచాయతీ నిధులు రూ.8 లక్షలు వెచ్చించారు.
- నూకాంబిక, తలుపులమ్మ ఆలయాలకు పంచాయతీ నిధులు రూ.7 లక్షలతో సీసీ రోడ్లు వేశారు. మరో రూ.2.80 లక్షలతో పంచాయతీ భవనం చుట్టూ రక్షణ కంచె నిర్మించారు.

నెరవేరిన సొంతింటి కల

నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో 84 మందికి సొంతింటి యోగం కలిగింది. జగనన్న లేఅవుట్‌లో వీరికి పట్టాలిచ్చి, రూ.1.80 లక్షల చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం అందించింది. నిర్మాణ సామగ్రిని కూడా రాయితీ ధరలకు పంపిణీ చేసింది. సొంత స్థలాలున్న ఐదుగురికి ఇంటి నిర్మాణానికి సాయం చేసింది. ఇందులో దాదాపు 40 మంది గృహ నిర్మాణాలు పూర్తి చేసుకుని, వాటిలో నివాసం ఉంటున్నారు. వీరికి ఇంటింటి కుళాయి కనెక్షన్ ఇచ్చి తాగునీటి సదుపాయం కల్పించారు. దాతలు కూడా ముందుకు వచ్చి గ్రామాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్నారు. ఓ దాత సమకూర్చిన నిధులతో జాతీయ రహదారి నుంచి గొబ్బూరు గ్రామానికి అర కిలోమీటరు పొడవున 20 అడుగుల వెడల్పుతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. పనులు చురుగ్గా జరుగుతున్నాయి. దీంతోపాటు ఇదే రోడ్డు పక్కన మామిడివాక గెడ్డ సాగునీటి కాలువను కాంక్రీట్‌తో నిర్మించారు. గతంలో ఎన్నడూలేని విధంగా గ్రామం అభివృద్ధి చెందడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జగన్ వల్లే సొంతింటి ధైర్యం



నేను వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాను. భార్య రాజేశ్వరి, పిల్లలు దేవీచరణ్, తేజేశ్వరి. వచ్చే అరకొర సంపాదనతో కుటుంబ పోషణ కష్టంగా ఉండేది. చాలా ఏళ్లు మేం అద్దె ఇళ్లలోనే ఉన్నాం. నెలకు రూ.3 వేలు అద్దెకే పెట్టాల్సి వచ్చేది. సొంతిల్లు అన్న ఆలోచన చేసేంత ధైర్యం లేదు. జగనన్న ప్రభుత్వంలో సొంతింటి యోగం కలిగింది. జగనన్న లేఅవుట్‌లో స్థలం, ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం అందించారు. దీంతో ఏడాది కిందటే నిర్మాణం పూర్తి చేసుకుని, సొంతింట్లో ఆనందంగా జీవిస్తున్నాం. ఇంటింటి కుళాయి కనెక్షన్ కూడా ఇచ్చారు. దీంతో తాగునీటి ఇబ్బందుల్లేవు. జగనన్న ప్రభుత్వానికి మా కుటుంబం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుంది.

– పప్పుల సన్యాసినాయుడు, జగనన్న కాలనీ

ఈ ప్రభుత్వంలోనే మౌలిక వసతులు



ఆటో నడుపుతూ వచ్చే అరకొర ఆదాయంతోనే బతుకు వెళ్లదీస్తున్నాం. భార్య నాగమహాలక్ష్మి, కొడుకు కార్తికేయ, కూతురు చార్మిరూప్. పిల్లల చదువులు, కుటుంబ పోషణ జగనన్న ప్రభుత్వంలో భారంగా మారలేదు. అర్హతున్న ప్రతి సంక్షేమ పథకం అందింది. గత ప్రభుత్వంలో మా కాలనీ నిర్మించారు. రోడ్లు మాత్రం వేయలేదు. వర్షం వస్తే మట్టి రోడ్లతో చాలా ఇబ్బంది పడేవాళ్లం. జగనన్న ప్రభుత్వంలో మా కష్టాలు తీరాయి. ఏడాది క్రితం మా కాలనీ రోడ్డును సిమెంట్ రోడ్డుగా మార్చారు. కాలనీలో అవసరమైన మౌలిక సదుపాయాలన్నింటినీ కల్పించారు. ఇపుడు మా కాలనీవాసులంతా ఇబ్బందుల్లేకుండా ఆనందంగా ఉన్నాం.

– బుద్ధ బాలబాపునాయుడు, చంద్రబాబు కాలనీ

సీఎం జగన్‌పైనే జనం నమ్మకం



మిరియాలకాలనీలో దర్జీని ఓటు అడుగుతున్న మలసాల భరత్‌కుమార్



లక్ష్మీదేవిపేట అభయాంజనేయస్వామి ఆలయం వద్ద పార్టీ శ్రేణులతో మలసాల భరత్‌కుమార్

- ప్రచారంలో దూసుకెళ్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల

అనకాపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునేందుకు బడుగు, బలహీన వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నిత్యం ఓటర్లతో మమేకం కావాలని ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో మిరియాల కాలనీలో బుధవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. భరత్‌కుమార్ గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధిని ఓటర్లకు వివరించి, ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనను గెలిపించాల్సిందిగా కోరారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశస్వాతంత్ర్య చరిత్రలో గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సీఎం జగన్ పాలనలో ఆచరణలోకి వచ్చిందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ఏర్పాటుతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు చేరాయన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు గత ప్రభుత్వాల్లో తమ సమస్యలు, అవసరాల కోసం మండల, జిల్లా కేంద్రాల్లోని అధికారుల చుట్టూ తిరిగాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో గ్రామ స్థాయిలోనే అన్ని అవసరాలూ తీరుతున్నాయన్నారు. 2019 ఎన్నికల మ్యానిఫెస్టోను 99 శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. తొలుత లక్ష్మీదేవిపేటలో అభయాంజనేయస్వామిని దర్శించుకుని, ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు–1 ఉగ్గిన అప్పారావు, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, పార్టీ నాయకులు పలకా సత్యనారాయణ, కోన ఉమా, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: వైఎస్సార్‌సీపీశ్రేణులు సమరోత్సాహంతో పనిచేసి రానున్న ఎన్నికల్లో పార్టీ ఘన విజయానికి కృషి చేయాలని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు కోరారు. మండలంలోని పరవాడపాలెం, బుచ్చియ్యపేట, వెదురుపర్తి, కశింకోటలోని బూత్ కమిటీల సభ్యులతో మంగళవారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి, పార్టీ అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌కు ఘన విజయం చేకూర్చాలన్నారు.



బుచ్చియ్యపేట గ్రామంలో పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు

ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, పార్టీ అభ్యర్థులను గెలిపించాల్సిందిగా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమాల్లో పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు కోన నాయుడు, మంత్రి జయరజని, పార్టీ నాయకులు గొంతిన శివ, బుల్లెట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

చేసిన మంచిని చెప్తే చాలు.. విజయం మనదే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్

- పార్టీ శ్రేణులతో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని చేసిన మేలును గడప గడపకు వెళ్లి ప్రజలకు వివరిస్తే చాలని, వారే తమ పార్టీకి ఘన విజయం చేకూర్చుతారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక గవరపాలెంలో 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన పార్టీ శ్రేణుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కుట్రలు, కుతంత్రాలు, అసత్య ప్రచారాలను ఎప్పటికప్పుడు దీటుగా ఎదుర్కోవాలని సూచించారు. మన ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు మరో గుర్తు చేసేలా ఇంటింటా ప్రచారం కొనసాగాలన్నారు. 2019 ఎన్నికల్లో వచ్చిన మెజార్టీని మించి ఈసారి పార్టీ గెలుపొందాలని అభిలషించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, సంక్షేమం, అభివృద్ధిని కొనసాగించాల్సిందిగా ప్రజలను అభ్యర్థించాలన్నారు. కార్పొరేటర్ కొణతాల నీలిమ మాట్లాడుతూ జగనన్న అందించిన సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని, ఈ 50 రోజుల్లో ప్రతి ఓటర్‌ను కలిసి, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని పార్టీ శ్రేణులకు తెలిపారు. కార్యక్రమంలో 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్, గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బొడ్డేడ శివ, వివిధ దేవాలయాల చైర్మన్లు కె.ఎం.నాయుడు, కొణతాల మురళి, ఆళ్ల నాగేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు పెంటకోట అప్పలనాయుడు, కర్రి రుద్రి, మారిశెట్టి శ్రీను, కాండ్రేగుల రాము, విల్లూరి శేఖర్, మోదినాయుడు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కుంచావారి గౌరీపరమేశ్వరుల విగ్రహ ప్రతిష్ట



గౌరీపరమేశ్వరుల పంచలోహ విగ్రహాన్ని ఊరేగిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు పెరుగు బజార్ జంక్షన్ కుంచావారి గౌరీపరమేశ్వరుల పంచలోహ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పంచలోహ విగ్రహాన్ని స్వామివారి రథంపై పురవీధుల్లో ఊరేగించారు. గౌరీపరమేశ్వరుల ఆలయం వద్ద విఘ్నేశ్వరపూజ, శుద్ధపుణ్యాహవచనం, సకలదేవత మండపారాధన, రుద్రహోమం, జలాధివాసం, క్షీరాధివాసం, ధాన్యాధివాసం, పుష్పాధివాసం, 108 కలశ స్థాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ ఎం.వీరభద్రరావు, గౌరవాధ్యక్షుడు పొండ్రంకి సత్యారావు, సభ్యులు కోరుకొండ సాంబశివరావు, కొమ్మోజి రామకృష్ణ, పాలూరి శ్రీనివాసరావు, విశ్రాంత మెడికల్ సూపరింటెండెంట్ ధర్మాల సాంబమూర్తి పాల్గొన్నారు.

ముగిసిన టెన్త్ ప్రధాన పరీక్షలు



కశింకోట డీపీఎన్ హైస్కూల్ నుంచి ఉత్సాహంగా బయటకు వస్తున్న టెన్త్ విద్యార్థులు



తాళ్లపాలెం హైస్కూల్ నుంచి పరీక్షలు రాసి వస్తున్న టెన్త్ విద్యార్థులు

కశింకోట: మండలంలో టెన్త్ క్లాస్ ప్రధాన పరీక్షలు బుధవారంతో ముగిశాయి. దీంతో విద్యార్థులు పరీక్ష కేంద్రం నుంచి ఆనందోత్సాహాలతో బయటకు వచ్చారు. మండలంలోని ఆరు కేంద్రాల్లో 1,344 మంది ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్ల విద్యార్థులు పరీక్షలు రాశారు. స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూల్, బాలికల హైస్కూల్, వివేకానంద స్కూల్, తాళ్లపాలెం, నరసింగబిల్లి, కన్నూరుపాలెం జెడ్పీ హైస్కూళ్లలో పరీక్షలు నిర్వహించారు. స్థానిక డీపీఎన్ స్కూల్ విద్యార్థులు మాత్రం ఒకేషనల్ కోర్సు పరీక్ష రాయాల్సి ఉంది. ఈ పరీక్షను ఈ నెల 30న నిర్వహించనున్నట్లు ఎంఈవో మూర్తి తెలిపారు. కశింకోటలోని బాలికల హైస్కూల్, వివేకానంద స్కూళ్లలో ఈ పరీక్ష జరపనున్నట్లు వెల్లడించారు. మిగిలిన కేంద్రాల్లో విద్యార్థుల పరీక్షలు పూర్తయినట్లు పేర్కొన్నారు. పరీక్షలు పూర్తి కావడంతో సహ విద్యార్థులతో సరదా కబుర్లాడుకున్నారు. ఆటోలు, బస్సులు, ద్విచక్ర వాహనాల మీద దూర గ్రామాల విద్యార్థులు ఇళ్లకు చేరారు. తాళ్లపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల పాఠశాల, తేగాడలోని ఆదర్శ పాఠశాల, కస్తూర్బా గాంధీ విద్యాలయం, కశింకోటలోని సమగ్ర బాలికల వసతి గృహంలో ఉన్న టెన్త్ విద్యార్థులు పరీక్షలు ముగియడంతో తమ వద్దకు వచ్చిన తల్లిదండ్రులతో కలిసి ఉత్సాహంగా ఇళ్లకు బయలుదేరారు.

- మండలంలో టెన్త్ పరీక్షల నిర్వహణ తీరును జిల్లా అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్ బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. మండలంలోని తాళ్లపాలెం జెడ్పీ హైస్కూల్, స్థానిక వివేకానంద స్కూల్‌ను సందర్శించారు.

బైక్ అదుపు తప్పి యువకుడికి గాయాలు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం–చోడవరం రోడ్డులోని బంగారమ్మపాలెం వద్ద బుధవారం ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో ఓ యువకుడికి గాయాలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు, స్థానికులు సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించడంతో వైద్య సిబ్బంది వైద్య సేవలు అందించారు. వివరాలు.. మండలంలోని బంగారమ్మపాలేనికి చెందిన సాలాపు శ్రీను విజయనగరం కొత్తవలస మండలం మంగళపాలెంలో తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నారు. బంగారమ్మపాలెంలో ముత్యాలమ్మ పండగ ఉండడంతో ఇటీవల స్వగ్రామానికి వచ్చారు. శ్రీను ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అదుపు తప్పడంతో గాయాలయ్యాయి. ప్రధాన వైద్యాధికారి డాక్టర్ చక్రవర్తి సిబ్బందితో కలిసి సకాలంలో వైద్య సేవలు అందించారు.

తోటాడలో వచ్చే నెల 9న భావనారుషి, భద్రావతిల కల్యాణం



కల్యాణ మహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మునగపాక : మండలంలోని తోటాడలో పురాతన శ్రీ భావనారుషి కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో వచ్చేనెల 9న భావనారుషి, భద్రావతిల కల్యాణం ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పద్మశాలీ సేవాసంఘం ఆధ్వర్యంలో బుధవారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆలయ ధర్మకర్తలు దొడ్డి త్రినాథ్, సన్యాసిరావు, తాతబ్బాయిలు మాట్లాడుతూ తమ పూర్వీకుల నుంచి ఉగాది పర్వదిన సందర్భంగా కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ అని తెలిపారు. ఆరోజు రాత్రి 7 గంటలకు ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక మండపంపై ఉంచి కల్యాణోత్సవం జరిపిస్తామన్నారు. అదేరోజు ఉదయం 6 గంటల నుంచి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగిస్తారన్నారు. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గెద్దం బాబూరావు, సూరిశెట్టి నమశ్శివాయ, నూకలక్ష్మి, నారాయణ, సూరిబాబు, రమణ, కుమార్‌రాజా, ప్రభాకర్ పాల్గొన్నారు.

కేజీబీవీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కోటవురట్ల: స్థానిక కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎస్‌వో సరితాదేవి తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి 6, 7, 8 తరగతులు, ఇంటర్ బైపీసీ ఫస్టియర్‌కు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 11వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు చూచుకొండలో నూకాంబిక విగ్రహ ప్రతిష్ట

మునగపాక : చూచుకొండలో గురువారం నూకాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ విగ్రహ ప్రతిష్టను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

తుది దశకు ఐసోలేషన్ సెంటర్ పనులు



సబ్బవరం పీహెచ్‌సీ ప్రాంగణంలో శరవేగంగా సాగుతున్న ఐసోలేషన్ సెంటర్ పనులు

సబ్బవరం: సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న ఐసోలేషన్ సెంటర్ పనులు తుదిదశకు చేరుకున్నాయి. దీంతో త్వరలో ప్రారంభించడానికి సిద్ధం చేస్తున్నారు. అలాగే గుల్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో కూడా రూ.10 లక్షలతో ఐసోలేషన్ సెంటర్ నిర్మించనున్నారు. కోవిడ్ వంటి పలు రకాల అంటు వ్యాధులు విజృంభించే సమయంలో ప్రత్యేకంగా రోగులకు వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ఈ సెంటర్ నిర్మాణం చేపట్టారు. ఆర్నెళ్ల కింద ఈ పనులకు ఎంపీపీ సూర్యకుమారితో కలిసి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. త్వరలో సేవలందించేందుకు ఐసోలేషన్ సెంటర్ అందుబాటులోకి రానుంది.